# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో మహా శివరాత్రి వేడుకలు శైవక్షేత్రాల్లో ఘనంగా జరుగుతున్నాయి.
- ❖ మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ లా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.
- ❖ పురుషుల టీ-20 ప్రపంచ కప్-2026లో భాగంగా భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య రాత్రి 7 గంటలకు కొలంబో వేదికగా క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కానుంది.

======================

రాష్ట్రంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వేకువజాము నుంచే పలు ప్రాంతాల్లో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగుతున్నాయి. శివుడికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తెల్లవారుజామున 2 గంటల నుంచే భక్తులను దర్శనానికి అనుమతించారు. దేవస్థానం అధికారులు రద్దీకి అనుగుణంగా ఆలయంలో ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో 7వ రోజు భ్రమరాంబ సమేతుడైన మల్లికార్జునస్వామి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

======================

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వారు పోస్ట్ చేశారు. శ్రీశైల జ్యోతిర్లింగ క్షేత్రం కొలువైన పవిత్ర భూమి మన రాష్ట్రంలోనే ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ పర్వదినాన మహాశివుని అనుగ్రహం కలిగి అందరికీ మంచి జరగాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. పరమేశ్వరుడి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో

వర్ధిల్లాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆలయాల పవిత్రతను కాపాడటమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

======================

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామం భీమేశ్వరస్వామి వారి ఆలయం శివరాత్రి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దుర్గా ఘాట్ వద్ద కృష్ణా నదిలో  పుణ్యస్నానాల ఆచరించారు. అనంతరం శివునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాయులింగక్షేత్రం శ్రీకాళహస్తి ఆలయం భక్తులతో నిండిపోయింది. మహాశివరాత్రి పర్వదినం కావడంతో భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. రద్దీకి అనుగుణంగా శ్రీకాళహస్తి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో స్వామి వారు ఇంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

======================

ప్రముఖ శైవక్షేత్రమైన పల్నాడు జిల్లా కోటప్పకొండపై వెలసిన త్రికోటేశ్వరస్వామి వారికి మహాశివరాత్రి రోజున తిరునాళ్లను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. స్వామివారికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వం తరపున ఈరోజు పట్టు వస్త్రాలు సమర్పించారు. హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు వంటి కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకం కలగకూడదని ఆ త్రికోటేశ్వరుని ప్రార్థించామని పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

======================

భారత సైన్యంలో 2 వేల 27 పోస్టులలో నియామకాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని గుంటూరులోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ డైరెక్టర్ కల్నల్ రజత్ సువర్ణ తెలిపారు. అగ్నివీర్  వివిధ విభాగాలలో అవివాహిత యువత నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల 13న విడుదలైందని తెలిపారు. గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ పరిధిలోని 14 జిల్లాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, క్లర్క్, స్టోర్ కీపర్, టెక్నికల్ వంటి విభాగాల్లో నియామకాలు జరుగుతాయన్నారు. గరిష్ఠ వయోపరిమితి 22 సంవత్సరాలు కాగా, అభ్యర్థులు www.joinindianarmy.nic.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

విరామం

======================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమన్ని జిల్లా కలెక్టరేట్ లో రేపు నిర్వహించనున్నట్టు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్  స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్

కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 20వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=======================

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అన్ని ప్రసిద్ధ శివాలయాల వద్ద ప్రత్యేక సహాయక చర్యలు కోసం 16 APSDRF బృందాలను ఏర్పాటు చేసిందని ఎపిఎస్‌డిఎంఎ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అత్యవసర సేవలు, ప్రజల భద్రత కోసం తగిన ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను నియమించామని పేర్కొన్నారు. పవిత్ర స్నానం ఆచరించే భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టిందన్నారు.

=======================

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ ప్రగతిశీల బడ్జెట్ అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులతో ఆయన ఈరోజు టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ బడ్జెట్.. రాష్ట్రాభివృద్ధికి ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ లా వుందని, సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమం ఆధారంగా బడ్జెట్ రూపొందించారని అన్నారు. రెవెన్యూ లోటును 1.86 శాతానికి పరిమితం చేయడం ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. 'వికసిత్ ఏపీ' ద్వారా 'వికసిత్ భారత్' నిర్మాణానికి ఈ బడ్జెట్ పునాది వేస్తోందని మాధవ్ పేర్కొన్నారు.

=======================

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఆయనకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు పోస్ట్ చేశారు. అహింస, మానవత్వం, సమానత్వానికి సేవాలాల్ మార్గదర్శనం చేశారని ముఖ్యమంత్రి కొనియాడారు. సేవాలాల్ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని, ఆయన స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా సేవాగడ్ లో ఈ రోజు జరిగిన సంత్ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి కార్యక్రమాల్లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి.. సంత్ సేవాలాల్ చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని తెలిపారు. సేవాలాల్ సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శమేనని పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

=======================

పురుషుల టీ-20 ప్రపంచ కప్-2026లో భాగంగా భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య రాత్రి 7 గంటలకు కొలంబొ వేదికగా క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. నేపాల్ తో జరిగిన మ్యాచ్ లో వెస్టిండీస్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సూపర్ 8కు చేరుకుంది. ఈరోజు ముంబై వేదికగా విండీస్, నేపాల్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది.

=======================
=======================